# సాక్షి
## భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | 1 | జూన్ | 2024






### మము బ్రోవమని చెప్పండి..
సీతారామ లింక్ కెనాల్ ప్రాజెక్టు కోసం పొలాలను దౌర్జన్యంగా లాక్కుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 10లో



### హత్య కేసులో అరెస్ట్
హత్య జరిగిన 24 గంటల్లోనే కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు కేసును ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేశారు. 10లో

గరిష్టం / కనిష్టం
40° / 29°

### వాతావరణం
జిల్లాలో శనివారం అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. వడగాలుల తీవ్రత కూడా ఎక్కువగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### స్వర్ణకవచధారణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం రామాలయ అంతరాలయంలోని స్వామివారి మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో శ్రీసీతారామ చంద్రస్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

### శ్రీకనకదుర్గమ్మకు పంచామృతాభిషేకం



పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం పంచామృతాభిషేకం నిర్వహించారు. మండల పరిధిలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయంలో శుక్రవారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూల విరాట్‌కు పంచామృతంతో అభిషేక పూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమపూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ జి.సుదర్శన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

### ప్రతీ గిరి గ్రామానికీ విద్యుత్..
భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



ఆదివాసీలతో ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలంటౌన్: ఉమ్మడి జిల్లాలోని అన్ని మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించామని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ తెలిపారు. అశ్వారావుపేట మండలంలోని వాగొడ్డుగూడెం, నారాయణపురం గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించగా, శుక్రవారం ఆ రెండు గ్రామస్తుల ప్రజలు ఐటీడీఏ కార్యాలయంలో పీఓను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ సమస్య తన దృష్టికి రాగానే అటవీశాఖ అధికారులతో చర్చలు జరిపి, ఫారెస్ట్ వారికి ఇబ్బందులు లేకుండా రూ.11 లక్షలతో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. వాగొడ్డుగూడెం గ్రామంలో 50, నారాయణపురంలో 25 ఆదివాసీ కుటుంబాలు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాయని పేర్కొన్నారు. ఏపీఓ పవర్ మునీర్ పాషా, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

### పీజీ దూర విద్యకు దరఖాస్తుల ఆహ్వానం
భద్రాచలంటౌన్: హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో దూరవిద్యా విధానం ద్వారా పీజీ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ డిప్లొమా ఇన్ రూరల్ డెవలప్‌మెంట్, పీజీ డిప్లొమా ఇన్ ట్రైబల్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్, పీజీ డిప్లొమా ఇన్ జియో స్పెషల్ టెక్నాలజీ అప్లికేషన్ ఇన్ రూరల్ డెవలప్‌మెంట్, డిప్లొమా ఇన్ పంచాయతీ గవర్నెన్స్, రూరల్ డెవలప్‌మెంట్ కోర్సులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వివరించారు. ఆసక్తి కలిగిన గిరిజనులు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కోర్సు కాల వ్యవధి 18 నెలలు ఉండగా గిరిజన అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు రూ. 300 చెల్లించాల్సి ఉంటుందని, వివరాలకు www. nirdpr. org. in వెబ్ సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

# హనుమాన్ భక్తులకు సౌకర్యాలేవి..?



రామాలయంలో హనుమాన్ భక్తుల రద్దీ (ఫైల్)

**ఆంజనేయ మాల విరమణకు తరలివస్తున్న భక్తులు**

- ప్రతీ ఏడాది భద్రగిరికి పెరుగుతున్న మాలధారులు
- రద్దీకి తగిన ఏర్పాట్లు చేయని దేవస్థానం అధికారులు
- ప్రత్యేక హాళ్లు కేటాయించాలని మాలధారుల వేడుకోలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: హనుమాన్ మాలధారులు భద్రాచలానికి పోటెత్తుతున్నారు. అయితే పెరుగుతున్న భక్తుల రద్దీకి తగినట్టు శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. గడిచిన రెండు దశాబ్దాలుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో హనుమాన్ మాల ధరిస్తున్న భక్తుల సంఖ్య పెరుగుతోంది. సాధారణంగా పదకొండు, ఇరవై ఒకటి, నలభై ఒక్క రోజుల దీక్షతో హనుమాన్ మాల ధరిస్తారు. ఆ తర్వాత ఇంటి దగ్గర మాతృమూర్తి సమక్షంలో లేదంటే ప్రముఖ ఆలయాల్లో మాల విరమణ చేసేందుకు మొగ్గు చూపుతుంటారు. ఆలయాల్లో మాల విరమణ చేసే భక్తులు ముందుగా నదీ/పుష్కరిణిలో స్నానమాచరిస్తారు. ఆ తర్వాత ఇరుముడి సమర్పణ చేస్తారు. అనంతరం మాల విరమణ క్రతువు నిర్వహిస్తారు. ఇందుకోసం కొండగట్టు ఆంజనేయ స్వామి, విజయవాడ కనకదుర్గ, శ్రీశైలం మల్లన్న, తిరుపతి తదితర దేవస్థానాల్లో ఇరుముడి సమర్పణకు, సాముహిక మాల విరమణకు ప్రత్యేకంగా హాళ్లు ఉన్నాయి. ఇక్కడ ఒకేసారి రెండుమూడు వందల మంది భక్తులు సామూహికంగా మాల విరమణ చేయవచ్చు. తెలంగాణ ఏర్పాటు తర్వాత హనుమాన్ భక్తుల్లో భద్రాచలం పుణ్యక్షేత్రానికి ప్రాధాన్యత పెరిగింది. హనుమాన్ మాల ధరించిన భక్తులు మొదటి ప్రాధాన్యతగా జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆలయాన్ని దర్శించుకుంటుంటే తదుపరి స్థానంలో ఇప్పుడు భద్రాచలం ఉంటోంది.

**కనీస సౌకర్యాలు కరువు**

ఆంజనేయ మాల ధరించిన భక్తులకు భద్రాచలంలో సరైన ఏర్పాట్లు లేవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం గోదావరిలో స్నానం చేసిన భక్తులు ఆలయ ప్రాంగణానికి చేరుకుని అక్కడ హనుమాన్ ఆలయంలో దేవస్థానం నిర్దేశించిన టికెట్‌ను తీసుకుని మాల విరమణ చేస్తున్నారు. ఆ తర్వాత సాధారణ భక్తుల తరహాలో సీతారాములను దర్శనం చేసుకుని వెళ్తున్నారు. ఒకేసారి ఇరవై నుంచి యాభై మంది భక్తులు వస్తే మాల విరమణ చేసేందుకు కష్టంగా ఉంటోంది. మరోవైపు దేవస్థానం ఆధ్వర్యంలో మిథిలా స్టేడియంలో అనేక హాల్స్ ఖాళీగా ఉన్నాయి. వినియోగించకపోవడంతో అవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. దేవస్థానం అధికారులు దృష్టి సారించి ఆ హాళ్లను ఉపయోగపడేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.

**భక్తులు ఏమి కోరుతున్నారంటే..**

ఇటీవల కొండగట్టు అంజనేయుడికి భద్రాచలం దేవస్థానం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించే విధానం అమల్లోకి తెచ్చారు. ఇదే ఒరవడిలో ఆంజనేయమాల విరమణకు భద్రాచలం వచ్చే భక్తుల కోసం దేవస్థానం తరఫున ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. మాల విమరణకు ఒక రోజు ముందుగా భద్రాచలం చేరుకునే భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేసుకునేందుకు వీలుగా హాలు కేటాయించాలి. అనంతరం ఒక రాత్రి నిద్ర, మరుసటి రోజు నదీ స్నానం చేశాక సామూహిక మాల విరమణకు ప్రత్యేక స్థలం కేటాయించాలి. మాల విరమణ టికెట్‌తోనే ఆలయంలో ప్రత్యేక దర్శనం అయ్యేలా చూడాలి. ఈ సౌకర్యాలు అందుబాటులోకి వస్తే హనుమాన్ చిన్న జయంతి, పెద్ద జయంతిల సందర్భంగా ఎంతో ఉపయోగం ఉంటుంది. శ్రీరాముడికి ఆంజనేయుడు వీర భక్తుడు. అంతటి ఆంజనేయుడి భక్తులు హనుమాన్ మాలధారణ/విరమణలకు భద్రాద్రికి రావడం మొదలైతే అయ్యప్ప మాల – శబరిమలై తరహాలో భద్రాచలం మరింతగా ప్రసిద్ధి పొందడంతోపాటు ఆదాయం కూడా పెరుగుతుంది. భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందడంతోపాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# విద్యార్థులకు ఎదురుచూపేనా..



ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఇన్‌సెట్) సాంఘిక సంక్షేమ గురుకులంలో సేకరించిన పాతపాఠ్యపుస్తకాలు

- నేటి నుంచి జూనియర్ కళాశాలల పునఃప్రారంభం
- ఇప్పటివరకు కాలేజీలకు చేరని పాఠ్యపుస్తకాలు

పాల్వంచరూరల్: నేటి నుంచి జూనియర్ కళాశాలలు తిరిగి ప్రారంభంకానున్నాయి. కానీ పాఠ్యపుస్తకాలు కళాశాలలకు చేరలేదు. ప్రభుత్వ పాఠశాలలు తిరిగి ప్రారంభించేనాటికి విద్యార్థులకు అందించేలా అన్ని స్కూళ్లకు ఇప్పటికే పాఠ్య పుస్తకాలకు చేర్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు అందజేయాల్సిన పాఠ్యపుస్తకాలు రాకపోవడంతో.. విద్యార్థులు పాత పుస్తకాలు వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. నూతన విద్యాసంవత్సరం ప్రారంభానికి ఒక రోజు ముందే పాఠ్యపుస్తకాలను అందిస్తామని ప్రభుత్వం పలుమార్లు పేర్కొంది. నేటి నుంచి ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభంకానుండగా, ఇప్పటివరకు పాఠ్యపుస్తకాలు జిల్లాకు రాలేదు. గతేడాది కూడా పాఠ్యపుస్తకాల పంపిణీలో జాప్యం జరిగింది. ఈసారీ అదే పరిస్థితి నెలకొనే అవకాశం కనిపిస్తోంది. జిల్లాలో 101 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 14, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు 32, గురుకుల కళాశాలలు 55 ఉన్నాయి. ఆయా కళాశాలలకు సుమారు 3 లక్షలకుపైగా పుస్తకాలు రావాల్సి ఉంది. ఇందులో ప్రభుత్వ కళాశాలలకు 35 వేల పాఠ్యపుస్తకాలు రావాలి. గురుకుల కళాశాలలకు పాఠ్యపుస్తకాలతోపాటు నోటుపుస్తకాలు కూడా అందించాల్సి ఉంది. కాగా ఈసారి పుస్తకాల ముద్రణలో జాప్యం జరుగుతోందని అధికారులు చెబుతున్నారు.

**రాగానే పంపిణీ చేస్తాం**



జూనియర్ కళాశాలలు నేటి నుంచి ప్రారంభమవుతున్నాయి. పాఠ్యపుస్తకాలు 35 వేలు రావాల్సిఉండగా ఇంకా రాలేదు. పాఠ్య పుస్తకాలు రాగానే అందిస్తాం. విద్యార్థులకు నష్టం జరగకుండా చూస్తాం.

–సులోచనారాణి, జిల్లా నోడల్ అధికారి

**పాతపుస్తకాలు అందిస్తాం**




గురుకుల కళాశాలలకు ఇంటర్ పాఠ్యపుస్తకాలు ఇంకా రాలేదు. కొత్తపాఠ్యపుస్తకాలు వచ్చేవరకు పాత పుస్తకాలను విద్యార్థులకు అందజేస్తాం. నోటు పుస్తకాలు కూడా రావాల్సి ఉంది.

–డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా సమన్వయాధికారి

### ఇరిగేషన్ డీఎస్ఈగా రాంప్రసాద్
భద్రాచలం: భద్రాచలం సర్కిల్ ఇరిగేషన్ శాఖలో ప్రస్తుతం ఈఈగా పనిచేస్తున్న రాంప్రసాద్‌కు అదే సర్కిల్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ప్రభుత్వం పూర్తి బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులను జారీ చేసింది. రాంప్రసాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా మరికొందరికి సైతం పదోన్నతి కల్పించింది.

# కరెన్సీ 'గంగానమ్మ'..

**రూ.5,50,116 నోట్లతో అమ్మవారికి అలంకరణ**



అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి గ్రామ సమీపంలో పెదవాగు ప్రాజెక్టు కట్ట కింద కొలువై ఉన్న శ్రీ గంగానమ్మ తల్లిని ధనలక్ష్మిగా అలంకరించారు. శుక్రవారం ఆలయ ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని రూ.5,50,116 కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు మహా అన్నసమారాధన, రాత్రి వేళ హోమగుండం ఏర్పాటు చేశారు.

–అశ్వారావుపేటరూరల్

# సరిపడా పత్తి విత్తనాలు

**అదనపు కలెక్టర్ వేణుగోపాల్**



పాల్వంచలోని విత్తన దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

పాల్వంచరూరల్: పత్తి విత్తనాలు సరిపడా అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తెలిపారు. జిల్లాలో పత్తి విత్తనాల లభ్యతపై శుక్రవారం ఆయన ఆరా తీశారు. పట్టణంలోని విత్తన దుకాణాల్లో జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావుతో కలిసి తనిఖీలు నిర్వహించారు. విత్తన నిలవలను, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2,16,625 ఎకరాల్లో పత్తి సాగయ్యే అవకాశం ఉందని, ఇప్పటివరకు 3,83,004 పత్తి విత్తన ప్యాకెట్లు వచ్చాయని వివరించారు. 5,41,560 ప్యాకెట్లు మరో వారం రోజుల్లో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. జిల్లా వ్యవసాయశాఖాధికారి మాట్లాడుతూ బీటీ పత్తి విత్తన రకాలు చాలా ఉన్నాయని, గత సీజన్‌లో ఏది మంచి దిగుబడి ఇచ్చిందో గమనించి, దానికి అనుగుణంగా విత్తన రకాలను ఎంపిక చేసుకుని సూచించారు. భూమిలో తేమలేకుండా విత్తనాలను విత్తుకోవద్దని, 50 నుంచి 60 సెంటీమీటర్ల వర్షం కురిసిన తర్వాతనే విత్తనాలు విత్తుకోవాలని చెప్పారు. ఈ తనిఖీల్లో ఏడీఏ రవికుమార్, ఏఓ శంభోశంకర్ ఉన్నారు.

# రైల్వే ఓవర్ బ్రిడ్జి రెడీ..



వంతెన మీదుగా వెళుతున్న వాహనాలు

సుజాతనగర్: కొత్తగూడెం–సుజాతనగర్ మధ్య నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) ఎట్టకేలకు సిద్ధమైంది. భద్రాచలం రోడ్- సత్తుపల్లి రైల్వేలైన్ నిర్మించడంతో ఇక్కడ ఆర్వోబీ ఏర్పాటు చేయాల్సి వచ్చింది. దీంతో రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.45 కోట్లతో ఈ వంతెన నిర్మించారు. మూడేళ్ల క్రితమే నిర్మాణ పనులు ప్రారంభించారు. ఏడాది క్రితం రైలు మార్గం ప్రారంభంకాగా, వాహనాలు నిర్మాణంలో ఉన్న వంతెన పక్క నుంచి రాకపోకలు సాగించాయి. దీంతో రైలు వచ్చిన సమయంలో గేటు పడి వాహనాలు ఆగాల్సి వచ్చేది. ఇప్పుడు వంతెన పూర్తికావడంతో వాహనాలు రయ్ రయ్ మంటూ దూసుకెళుతున్నాయి. ఆర్వోబీ అందుబాటులోకి రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆర్వోబీని అధికారికంగా ప్రారంభించాల్సి ఉంది.

# స్థానిక పోరుపై సందిగ్ధం

- పంచాయతీ ఎన్నికలకు ఇటీవల సర్వం సిద్ధం చేసిన అధికారులు
- ఆ తర్వాత ముందుకు సాగని ప్రక్రియ
- ప్రత్యేకాధికారుల పాలనలో జీపీలు
- కొత్త రిజర్వేషన్ల పై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 1,070 గ్రామ పంచాయతీలు



గ్రామపంచాయతీ కార్యాలయం

సాక్షిప్రతినిధి, ఖమ్మం : గడువు తీరిన గ్రామపంచాయతీ పాలక వర్గాల ఎన్నికలకు ఇప్పట్లో ముహూర్తం కుదిరేలా లేదు. ఈ జూన్‌లో పంచాయతీ ఎన్నికలు ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ప్రకటించినా.. ఆ దిశగా అడుగులు పడడం లేదు. గత ఫిబ్రవరి 1న పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. ఆ సమయంలో ఈసీ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఎన్నికల సామగ్రి సిద్ధం చేశారు. ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికలు రావడంతో పంచాయతీ ఎలక్షన్లు జూన్‌లో నిర్వహిస్తారని అంతా భావించారు. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు కొనసాగిస్తారా.. మారుస్తారా.. అనే చర్చ అంతటా జరుగుతోంది. మరోవైపు బీసీ జనగణన చేసిన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ వస్తోంది. దీంతో పంచాయితీ ఎన్నికలకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలోని 1,070 గ్రామ పంచాయతీ పాలక వర్గాల గడువు ముగియడంతో ప్రస్తుతం కార్యదర్శుల పాలన కొనసాగుతోంది.

**నాలుగు నెలలుగా..**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 1,070 జీపీలు ఉండగా.. 2019లో 1,061 గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. అదే ఏడాది ఫిబ్రవరి 2న పంచాయతీ పాలక వర్గాలు కొలువుదీరాయి. ఐదేళ్లపాటు పాలక వర్గాలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాయి. పాలక వర్గాల పదవీ కాలం ఈ ఏడాది ఫిబ్రవరి 1తో ముగిసింది. దీంతో అప్పటి నుంచి పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేకాధికారులుగా పాలన బాధ్యతలు చేపట్టారు. ఖమ్మం జిల్లాలో 589 గ్రామ పంచాయతీలు ఉండగా.. 579 మంది కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. మరో 10 గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జులుగా పంచాయతీ కార్యదర్శులు వ్యవహరిస్తున్నారు. గత నాలుగు నెలలుగా వీరి పర్యవేక్షణలోనే గ్రామాల్లో పాలన సాగుతోంది. భద్రాద్రి జిల్లాలో 481 గ్రామ పంచాయతీలు ఉండగా..477 జీపీలకు ఎన్నికలు జరిగాయి. ఖమ్మం జిల్లాలో 584 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు.

**ఎన్నికలకు ఏర్పాట్లు చేసినా..**

గతేడాది డిసెంబర్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు కూడా నిర్వహించాలని భావించింది. ప్రధానంగా గ్రామ పంచాయతీల పదవీ కాలం ఈ ఏడాది ఫిబ్రవరితో ముగుస్తున్నందున ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. పార్లమెంట్ ఎన్నికల అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ప్రకటించారు. అలాగే రాష్ట్ర ఎన్నికల సంఘం కలెక్టర్‌కు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా అధికారులు ఏర్పాట్లు కూడా చేశారు. ఎన్నికల సామగ్రి సిద్ధం చేశారు. బ్యాలెట్ బాక్సులు తదితర సామగ్రిని అందుబాటులో ఉంచారు. సర్పంచ్‌లు, వార్డు సభ్యుల రిజర్వేషన్ల వివరాలను కార్యదర్శుల ద్వారా రాష్ట్ర ఎన్నికల సంఘం సేకరించింది. ఆ తర్వాత ఎన్నికలకు సంబంధించి ఎటువంటి కార్యాచరణ ముందుకు సాగలేదు.

**రిజర్వేషన్ల పీటముడితో..**

గ్రామ పంచాయతీ ఎన్నికలకు రిజర్వేషన్లు ప్రధాన అడ్డంకిగా మారాయి. 2019లో జీపీ ఎన్నికల సందర్భంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 గ్రామపంచాయతీ చట్టం తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారమే నాడు ఎన్నికలు నిర్వహించారు. దీని ప్రకారం రిజర్వ్‌డ్ పంచాయతీలకు పదేళ్లపాటు ఒకే రిజర్వేషన్ ఉంచి ఎన్నికలు నిర్వహించే వెసులుబాటు కలిగింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఈ చట్టం ప్రాతిపదికగా ఎన్నికలు నిర్వహిస్తుందా.. లేక కొత్త చట్టం తెస్తుందా అనేది స్పష్టత రాలేదు. కొత్త చట్టాన్ని తీసుకొస్తే పంచాయతీతోపాటు వార్డుల రిజర్వేషన్లు కూడా మారుతాయి. మరోవైపు బీసీ గణన తదితర కార్యక్రమాలతో ఎన్నికలు ఆలస్యం అవుతాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

**ఆశావహుల ఎదురుచూపు..**

గ్రామస్థాయి నేతలు పంచాయతీ ఎన్నికల సమరం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ జూన్‌లో ఎన్నికలు ఉంటాయనే ఉద్దేశంతో పోటీకి ఆయా పార్టీల నేతలు అన్నీ సిద్ధం చేసుకున్నారు. అయితే ఎన్నికలు మరికొంత ఆలస్యం అయ్యే అవకాశం ఉండటంతో ఎప్పుడు జరుగుతాయోనని ఆరా తీస్తున్నారు. గతంలో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులుగా ఉన్న వారితోపాటు కొత్త వారు కూడా పోటీకి ఉవ్విళ్లూరుతున్నారు. దీంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా పంచాయతీ ఎన్నికల చర్చే సాగుతోంది. బరిలో నిలబడేందుకు రాజకీయ పార్టీల మద్దతు కోసం ఆశావహులు తమ ప్రయత్నాల్లో మునిగారు.

| | |
|---|---|
| ఖమ్మం జిల్లాలో గ్రామ పంచాయతీలు | : 589 |
| ఎన్నికలు నిర్వహించినవి | : 584 |
| ఎన్నికలు నిర్వహించనివి | : 05 |
| జిల్లాలోని వార్డులు | : 5,389 |
| పంచాయతీ కార్యదర్శులు | : 579 |
| పంచాయతీ కార్యదర్శుల ఖాళీలు | : 10 |
| భద్రాద్రి జిల్లాలో గ్రామ పంచాయతీలు | : 481 |
| ఎన్నికలు జరిగినవి | : 477 |
| ఎన్నికలు నిర్వహించనివి | : 04 |
| వార్డులు | : 4,232 |
| ప్రత్యేక అధికారులు | : 476 |

# పర్సా ఆశయ సాధనకు కృషిచేద్దాం

**శత జయంతి వేడకల్లో వక్తలు**



మాట్లాడుతున్న చుక్కా రాములు, పక్కన నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): నమ్మిన ఆశయ కోసం పనిచేసిన గొప్ప నాయకుడు పర్సా సత్యనారాయణ అని, ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు పిలుపునిచ్చారు. కొత్తగూడెం క్లబ్‌లో శుక్రవారం జరిగిన పర్సా శత జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. సత్యనారాయణ ఉమ్మడి రాష్ట్ర ఉద్యమ నేత అని, కార్మికోద్యమ విస్తరణకు విశేష కృషి చేశారని కొనియాడారు. సీఐటీయూ అభివృద్ధికి ఆయన జీవితాన్ని త్యాగం చేశారని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధిగా, కార్మిక నేతగా సుదీర్ఘకాలం పనిచేసిన పర్సా ఏనాడూ డబ్బు కోసం పరితపించలేదన్నారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నప్పుడు అభిమానులు ఆర్థిక సాయంగా ఇచ్చిన రూ.34 వేలు కూడా పార్టీకి సమర్పించిన గొప్ప నాయకుడని అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. పర్సా జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, సీపీఎం, సీఐటీయూ నాయకులు సీహెచ్.నర్సింగరావు, పాలడుగు భాస్కర్, పి.రాజారావు, పోతినేని సుదర్శన్, కొలగాని బ్రహ్మచారి, కాసాని అయిలయ్య, అన్నవరపు కనకయ్య, చావా రవి, ఎం.సుబ్బారావు, కళ్యాణం వెంకటేశ్వరరావు, పీఎస్ఎన్ మూర్తి, డి.వీరన్న, సింగరేణి మాజీ డైరెక్టర్ బి.భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పామాయిల్ సాగుతో అధిక లాభాలు



రైతులతో మాట్లాడుతున్న సూర్యనారాయణ

అన్నపురెడ్డిపల్లి: పామాయిల్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందొచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని తాటిబు చ్చన్నగూడెం గ్రామంలోని పామాయిల్ తోటను ఆయన పరిశీలించి, సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని పంట భూములు పామాయిల్ తోటల సాగుకు అనుకూలంగా ఉన్నాయన్నారు. ఆయిల్‌పాం సాగుతో రైతులు నికర ఆదాయం పొందవచ్చని, పామాయిల్ తోటలు సాగుచేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలు, డ్రిప్‌ను అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఓ శాంతిప్రియ, గోద్రెజ్, ఉద్యానశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### పొగాకుతో కేన్సర్ వచ్చే ప్రమాదం



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ శిరీష, వైద్య సిబ్బంది

కొత్తగూడెంరూరల్: పొగాకు ఉత్పత్తులైన ఖైనీ, జర్దా, గుట్కా, సిగరెట్, బీడీ, చుట్ట, పాన్‌మసాలా వినియోగించటం వల్ల కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందని డీఎంహెచ్ శిరీష సూచించారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పీహెచ్‌సీలో పొగాకు వినియోగంపై ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొగాకు ఉత్పత్తులు వినియోగిస్తే నోరు, గొంతు, పేగులు, ఊపిరితిత్తులు, గుండె లాంటి అవయవాలకు కేన్సర్ రావొచ్చని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటలు, సినిమాలకు ఆకర్షితులై ఆడ, మగ తేడా లేకుండా పొగాగు ఉత్పత్తులకు అలవాటుపడుతున్నారని, వీటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి స్వప్న, సీహెచ్‌ఓ లక్ష్మి, సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

### పుస్తకం ఆవిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న శివారెడ్డి తదితరులు

కొత్తగూడెంటౌన్: హైదరాబాద్‌లో మే 29, 30వ తేదీల్లో బాలల సాహిత్య సమ్మేళనం కార్యక్రమం నిర్వహించగా కొత్తగూడెం విద్యానగర్‌కాలనీకి చెందిన సుమిత్రాదేవి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో కోడూరి శాంతమ్మ జ్ఞాపకార్థం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమిత్రాదేవి రచించిన పుస్తకాన్ని సారస్వత పరిషత్ అధ్యక్షులు ఏలూరి శివారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జుర్రు చెన్నయ్య, నరేశ్‌రావు, గరిపెల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### డీపీఓ ఆకస్మిక తనిఖీ



సెగ్రిగేషన్ కేంద్రంలో పరిశీలిస్తున్న డీపీఓ చంద్రమౌళి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పాత రెడ్డిగూడెంలో శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలోని వైకుంఠ ధామం, పల్లెప్రకృతి వనం, వన నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ.. ప్రతి రోజూ తడి, పొడి చెత్త ఇళ్ల వద్ద నుంచి సేకరించాలని, తద్వారా సంపద సృష్టించాలని కార్యదర్శి సబితకు సూచించారు. వన నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను ప్రతి రోజూ పర్యవేక్షించాలని, ప్రస్తుతం అధిక ఎండలు ఉన్న నేపథ్యంలో వాటికి సరిపడా నీరు అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

### రక్షణ కల్పించండి..

ఇల్లెందు: కొంత కాలంగా తన పెద్ద కుమారుడు వెంకటేశ్వర్లు, అతడి భార్య కవిత తనను హతమార్చాలని చూస్తున్నారని, అకస్మాత్తుగా అర్ధరాత్రి పూట దాడి చేశారని, ఇంట్లోని వస్తువులు ధ్వంసం చేశారని, టీవీ, కుర్చీలు విరగొట్టి గొంతు నులిమే యత్నం చేశారని పట్టణంలోని కాకతీయనగర్‌కు చెందిన ఈసం భద్రమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారి నుంచి ప్రాణ భయం ఉందని, రక్షణ కల్పించాలని కోరారు. ఈ మేరకు ఎస్‌ఐ సందీప్ విచారణ చేసి కేసు నమోదు చేశారు.

### పామాయిల్ గెలలు



| | |
|---|---|
| టన్ను ధర | రూ.14,229 |

# మము బ్రోవమని చెప్పండి..

- 'సీతారామ' నిర్వాసితులకు అందని పరిహారం
- రైతుల పొలాల్లో జరుగుతున్న లింక్ కెనాల్ పనులు
- నోటీసులు ఇవ్వలేదు.. పరిహారం ప్రకటించలేదు..
- ఆందోళనలో కర్షకులు



ఏన్కూరులో జరుగుతున్న సీతారామ లింక్ కెనాల్ ప్రాజెక్టు పనులు

ఏన్కూరు: తాత, ముత్తాతల కాలం నాటి పొలాలను కాపాడుకుంటూ వస్తుంటే నేడు సీతారామ లింక్ కెనాల్ ప్రాజెక్టు అని తమ పొలాలను దౌర్జన్యంగా లాక్కుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు పనులు ప్రారంభించే రెండు నెలల ముందు నోటీసులు ఇస్తామని చెప్పిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆదేశాలను అమలుచేయలేదు. ఎలాంటి పరిహారం ప్రకటించకముందే తమ పొలాల్లో పనులు చేస్తున్నారని, ఇదెక్కడి అన్యాయమంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. పనులను అడ్డుకున్న రైతులకు ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిహారం ఇస్తామని ప్రజా ప్రతినిధులు, అధికారులు అంటున్నారని రైతులు వాపోతున్నారు. జూలూరుపాడు మండలం వినోభానగర్ 18వ టన్నెల్ నుంచి ఏన్కూరు మండలం హిమామ్‌నగర్ మీదుగా రేపల్లెవాడ నుంచి ఏన్కూరు ఎన్నెస్పీ కెనాల్ వరకు సీతారామ లింక్ కెనాల్ పనులు 80 మీటర్ల వెడల్పుతో మొదలు పెట్టారు. దీంతో 100 మంది రైతులకు చెందిన సుమారు 120 ఎకరాలు కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడింది. 120 ఎకరాల్లో రైతులు పామాయిల్, మామిడి తోటలు, కరివేపాకు, ఇతర దీర్ఘకాల పంటలు నష్టపోవాల్సి వస్తోంది. పొలాల్లోని బోర్లు, బావులు, చెట్లను సైతం కోల్పోతున్నారు. ఆ పొలాలు కొన్ని రోడ్డు పక్కన ఉండడంతో డిమాండ్ బాగా ఉంది. మార్కెట్‌లో ఎకరం రూ.కోటి ధర పలుకుతోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, పరిహారం ప్రకటించకుండా పనులు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పరిహారం ఇచ్చే వరకు పనులు నిలిపివేయాలని పలుమార్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసిన, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా ఎవరూ స్పందించడం లేదని అంటున్నారు. మండలంలో జరుగుతున్న సీతారామ ప్రాజెక్టు పనులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలుమార్లు పరిశీలించారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత రైతుల



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు (ఫైల్)

సమస్యను ప్రభుత్వం దృష్టికి, కలెక్టర్ దృష్టికి తీసుకొస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఎన్నో ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్న తమ పొలాలను తీసుకొని తమకు పరిహారం కాకుండా వేరే ప్రాంతంలో పొలాలు ఇప్పించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

#### రెండెకరాలు నష్టపోయాను



సీతారామ ప్రాజెక్టు లింక్ కెనాల్ పనులతో రోడ్డు పక్కన గ్రామ సమీపంలోని రెండు ఎకరాల భూమి కోల్పోయాను. భూమి విలువ రూ.2 కోట్లు ఉంటుంది. అధికారులు నోటీసులు, పరిహారం ఇవ్వకుండా పనులు మొదలు పెట్టారు. వంశపారంపర్యంగా వస్తున్న భూములు కోల్పోతుంటే బాధగా ఉంది. రైతులకు సరిపడా పరిహారం ఇవ్వాలి.

– వెనిగండ్ల శ్రీహరి, రైతు, హిమామ్‌నగర్

#### భూమి కింద భూమి ఇవ్వాలి



సీతారామ ప్రాజెక్టు లింక్ కెనాల్‌తో 5 ఎకరాల భూమి పోయింది. పామాయిల్ 2 ఎకరాలు, మెట్ట భూమి 3 ఎకరాలు. బోరు కూడా ఉంది. కానీ ఎటువంటి పరిహారం ఇవ్వలేదు. రోడ్డు పక్కనే భూమి ఉంది, రోడ్డు నుంచి దారి కూడా ఉంది. చాలా విలువ గల భూమి నాది. తిరిగి భూమి కొందామన్న దొరకడం లేదు. మా భూమి కింద భూమి ఇవ్వాలి.

– మేడ కృష్ణయ్య, రైతు, ఏన్కూరు

#### రైతులు నష్టపోతున్నారు



సీతారామ లింక్ కెనాల్ ప్రాజెక్టు పనులు వల్ల గిరిజన రైతులు భూములు కోల్పోతున్నారు. అధికారులు భూ సర్వే చేశారు గానీ పరిహారం ప్రకటించలేదు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నోటీసులు ఇచ్చిన రెండు నెలల తరువాత పనులు మొదలు పెడతామని చెప్పారు. కానీ, దౌర్జన్యంగా పనులు చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు పరిహారం ఇవ్వాలి.

– బానోత్ బాలాజీ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

అదనపు కలెక్టర్ వేణుగోపాల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): బడి బాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రవేశం పొందేలా కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 3వ తేదీ నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాలు జిల్లాలోని అన్ని ఆవాస ప్రాంతాల్లో నిర్వహిస్తామని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా అందజేసే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు, డిజిటల్ విద్య, ఉపకార వేతనాలు, ఇతర ప్రోత్సాహకాల గురించి అందరికీ తెలియజేయాలన్నారు. 6 నుంచి 14 ఏళ్ల వయస్సు కలిగిన బడి ఈడు పిల్లలందరినీ గుర్తించి సమీపంలోని బడికి వెళ్లేలా ప్రోత్సహించాలని చెప్పారు. మధ్యలో బడి మానివేసిన పిల్లలను గుర్తించి, అమ్మ ఆదర్శపాఠశాలల కమిటీ సభ్యులతో, మహిళా సమాఖ్యల ద్వారా వారి తల్లిదండ్రులతో మాట్లాడి అర్హత కలిగిన తరగతుల్లో తిరిగి చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బడిబాట కార్యక్రమంలో మహిళా స్వయం సహాయక సంఘాలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను భాగస్వామ్యం చేయాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లా విద్యా కోఆర్డినేటర్లు పీపీటీలతో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సమావేశంలో డీఈఓ వెంకటేశ్వరాచారి, అడిషనల్ డీఆర్‌డీఓ రవి, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మతోపాటు అధికారులు బాబూరావు, అనసూర్య, ఇందిర, సంజీవరావు పాల్గొన్నారు.

# పాపం పసివాడు..

- పదిరోజులైనా కానరాని జాడ..
- పోలీస్ బృందాలతో వేట



అదృశ్యమైన బాలుడు

సత్తుపల్లి: పదకొండు నెలల పసివాడు అదృశ్యమై పదిరోజులు కావస్తోంది.. కుమారుడి కోసం ఆ తల్లి ఏడ్చిఏడ్చి కన్నీళ్లు ఇంకిపోయాయి.. పిల్లోడి కోసం వాకబు చేయని ఊరులేదు.. అయినా బాలుడి జాడ దొరకక పోవటంతో ఆ కన్నతల్లిదండ్రులను చూసినవారు కన్నీటిపర్యంతమవుతున్నారు. సత్తుపల్లి పట్టణ శివారులోని గుడిపాడు గుడారాల్లో నివసిస్తున్న పాల్వంచకు చెందిన వానరాసి జంపన్న, దుర్గ దంపతుల 11 నెలల కుమారుడు సాయిదేవాన్ష్ మే నెల 20వ తేదీ రాత్రి కనిపించకుండా పోయిన విషయం పాఠకులకు విదితమే. అప్పటి నుంచి కన్నతల్లిదండ్రులతో పాటు సంచార జీవితం సాగిస్తున్న బుడగ జంగాలు బాలుడి ఆచూకీ కోసం తమ శక్తి మేరకు వెతుకులాడుతూనే ఉన్నారు. అయినా ఇప్పటి వరకు కనీసం బాలుడి జాడ తెలియక పోవటంతో ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తూనే ఉన్నారు.

**ఏసీపీ రఘు విచారణ**

బాలుడు అదృశ్యమైన ప్రాంతాన్ని కల్లూరు ఏసీపీ ఎ.రఘు, సీఐ టి.కిరణ్ శుక్రవారం మరోసారి పరిశీలించి విచారణ చేపట్టారు. ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న బుడ జంగాల వివరాలను పోలీస్ సిబ్బందితో క్షుణ్ణంగా సేకరిస్తున్నారు. ఎప్పటి నుంచి ఉంటున్నారు..? పిల్లవాడు అదృశ్యమైన రోజు ఎంత మంది ఉన్నారు..? ఈ స్థలం ఎవరిది..? గుడారాలు వేసుకొని ఉంటున్నవారి ఫోన్ నెంబర్లు..? ఎక్కడెక్కడి నుంచి వచ్చారు. ఇలాంటి ప్రతి సమాచారాన్ని సేకరించారు. అనుమానాస్పదంగా ఆ రోజు ఎవరెవరు కన్పించారు అనే విషయాన్ని తెలుసుకునేందుకు తల్లిదండ్రులను విడివిడిగా అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు.



గుడారాలలో నివసిస్తున్న వారి వివరాలను సేకరిస్తున్న పోలీస్ సిబ్బంది

**క్లూస్‌ను పట్టుకొని..**

బాలుడు అదృశ్యమైన రోజు ఈ ప్రాంతంలో ఎవరెవరు సంచరించారు? అనే విషయాలను పోలీసులు క్లూస్ పట్టుకొని లోతైన విచారణ చేపట్టారు. ఆ రోజు అనుమానాస్పదంగా తిరిగిన వాహనాన్ని గుర్తించి ఆ దిశలో విచారణను వేగవంతం చేశారు. ఈ తరహా కిడ్నాప్ కేసులు ఎక్కడెక్కడ జరిగాయి..? దాని వివరాలను సేకరించి ఈ కేసుతో సరిపోల్చి చూస్తున్నారు. హైదరాబాద్‌లో పట్టుబడిన పిల్లల ఫొటోలను సైతం తల్లిదండ్రులకు చూపించారు. పిల్లవాడు అదృశ్యమైన రాత్రి సమయంలో జరిగిన ప్రతి చిన్న ఘటనను గుర్తుకు తెచ్చుకొని చెప్పేలా అక్కడే ఉంటున్న స్థానికులను పలు కోణాల్లో విచారిస్తున్నారు.

## నిజనిర్ధారణ బృందాలను అడ్డుకోవడం తగదు

- ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి
- ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక డిమాండ్

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో ఆపరేషన్ కగార్ పేరిట జరుగుతున్న దాడులను నిలిపివేయాలని, మావోయిస్టులు, ఆదివాసీలపై మారణహోమం జరుగుతున్న ప్రాంతాలకు నిజ నిర్ధారణ కోసం వెళ్తున్న సీడీఆర్‌ఓ, పౌరహక్కుల, ఇతర ప్రజాసంఘాలను అడ్డుకోవడం సరైంది కాదని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు వేదిక సభ్యులు కె. గోవర్దన్ (సీపీఐ -ఎంఎల్ న్యూడెమోక్రసీ), పాణి (విప్లవ రచయితల సంఘం), బి.జ్యోతి (చైతన్య మహిళా సంఘం), డి.జాన్ (ప్రజాకళామండలి), కె.రవిచందర్ (ఎఫ్‌ఏఆర్ తెలంగాణ) శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం రోజున నిజ నిర్ధారణకు వెళ్తున్న సంఘాల నేతలను కుంట వద్ద సీఆర్‌పీఎఫ్ పోలీసులు అడ్డుకున్నారని ఆరోపించారు. అక్కడి నుంచి వెనుదిరిగి బీజాపూర్ జిల్లాకు వెళ్తున్న క్రమంలో తెర్లగడ వద్ద మళ్లీ అడ్డుకుని ఇబ్బందులకు గురి చేశారని వాపోయారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దేశంలో ఒక భాగం కాదా అని ప్రశ్నించారు. ఆ రాష్ట్రంలో జరుగుతున్న మారణహోమంపై నిజనిర్ధారణ చేసేందుకు వెళ్తున్న సభ్యులకు అడ్డంకులు సృష్టించడం సరైంది కాదని పేర్కొన్నారు. ఈ ఘటనను ప్రతీ ఒక్కరూ ఖండించాలని కోరారు.

### వెంగళరాయసాగర్‌కు నిధులు మంజూరు చేయండి

చండ్రుగొండ: మండలంలోని సీతాయిగూడెం గ్రామంలో గల వెంగళరాయసాగర్ మరమ్మతు పనుల కోసం నిధులు మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరినట్లు మంత్రి కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటన విడుదలైంది. 2019లో ప్రాజెక్ట్ అలుగుకు గండి పడిన విషయం విదితమే. గండికి శాశ్వత మరమ్మతుల కోసం జలవనరుల శాఖాధికారులు రూ.33.55 కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు చేశారు. రైతుల అవసరాల నిమిత్తం నిధులు మంజూరు చేయాలని మంత్రి తుమ్మల ఉపముఖ్యమంత్రికి సిఫార్సు చేసినట్లు ప్రకటనలో తెలిపారు.

**పనులు పూర్తి చేయించండి..**

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఊట్లపల్లి వద్దగల వెంకమ్మ చెరువు ఫ్లడ్ కెనాల్ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం ఆయన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. వెంకమ్మ చెరువు వరద కాలువ పనులు పూర్తి చేయాలని కోరారు.

### గర్భిణి మృతిపై కేసు

కరకగూడెం: గర్భిణి మృతిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాజేందర్ కథనం ప్రకారం.. మండలంలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన లావణ్య(24)కు అదే గ్రామానికి చెందిన జాడి శేఖర్‌తో నాలుగేళ్ల కిందట వివాహమైంది. మే 30న నాలుగు నెలల గర్భవతి అయిన లావణ్య అస్వస్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెంలోని మరో ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో గురువారం మృతి చెందింది. మృతురాలికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



### పేకాట స్థావరంపై దాడి

పాల్వంచరూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామ శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం పేకాట శిబిరంలో పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఘటనా స్థలంలో మొత్తం ఏడుగురు ఉండగా ఐదుగురు పరారయ్యారని, ఇద్దరు పట్టుబడ్డారని వారి వద్ద నుంచి రూ.3,400 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

## హత్య కేసు నిందితుడి అరెస్ట్

24 గంటల్లోనే పట్టుకున్న వన్‌టౌన్ పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రెహమాన్, సీఐ

కొత్తగూడెంటౌన్: హత్య జరిగిన 24 గంటల్లోనే కేసును ఛేదించి.. నిందితుడు తమ్మిశెట్టి కోటేశ్వరరావును కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. కొత్తగూడెం పట్టణం పోస్టాఫీస్ సెంటర్‌లో మద్యం మత్తులో గుణదీప్ (21)ను తమ్మిశెట్టి కోటేశ్వరరావు కొట్టి హత్య చేశాడు. శుక్రవారం రాత్రి వివరాలను వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐ కరుణాకర్ తెలిపారు. 25 రోజుల కిందట తమ్మిశెట్టి కోటేశ్వరరావుకు, ఆర్యభట్ట గంగాధర వరప్రసాద్‌కు గొడవ జరిగింది. ఈ నెల 30వ తేదీ గురువారం గుణదీప్, అతడి స్నేహితుడు ఆర్యభట్ట గంగాధర వరప్రసాద్ కలిసి బార్‌షాపులో మద్యం సేవించారు. ఈ క్రమంలో కోటేశ్వరరావు గంగాధర వరప్రసాద్‌తో వాగ్వాదానికి దిగాడు. గుణదీప్ ఇద్దరికీ సర్దిజెప్పాడు. ఈ క్రమంలో గుణదీప్‌కు మద్యం ఇప్పిస్తానని చెప్పి కోటేశ్వరరావు బలవంతం స్కూటీపై ఎక్కించుకుని పోస్టాఫీస్ సెంటర్‌లోని వైన్‌షాపునకు తీసుకొచ్చాడు. ఈ క్రమంలో డబ్బులు కట్టే విషయంలో ఇద్దరికీ గొడవ జరిగింది. గుణదీప్‌ను తమ్మిశెట్టి కోటేశ్వరరావు కిందపడేసి గుండెలపై బలంగా తన్నడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు డీఎస్పీ తెలిపారు. గతంలో గొడవ జరిగిన సమయంలో ఉన్న మోహన్ అనే వ్యక్తి అనుకుని మద్యం మత్తులో గుణదీప్‌ను కొట్టి చంపినట్లు నిందితుడు అంగీకరించాడని, ఈ గొడవలో మరణించిన గుణదీప్, అతని సోదరుడు హిమవంత్‌కు ఏమాత్రం సంబంధం లేదని చెప్పారు. గుణదీప్ పెదనాన్న ఎల్లబోయిన రాజేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ రెహమాన్ వివరించారు. 24 గంటల్లోగా నిందితుడిని పట్టుకున్న కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్, బృందం సభ్యులను డీఎస్పీ అభినందించారు.

### ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు



మంటల్లో దగ్ధమవుతున్న ట్రాన్స్‌ఫార్మర్

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని కూనవరం రోడ్డులో ఉనన ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో గురువారం అర్ధరాత్రి మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం.. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి అకస్మాత్తుగా మంటలు రావడంతో ప్రజలు అగ్నిమాపక, విద్యుత్ శాఖాధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చెరుకున్న విద్యుత్ శాఖ అధికారులు దగ్ధమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడ అమర్చారు. ఈ ప్రమాదంలో ఎవరికీ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు.

### చెరువుకట్టపై మృతదేహం లభ్యం



పాపారావు మృతదేహం

చండ్రుగొండ: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆనుకుని ఉన్న ఊరచెరువు కట్టపై ఓ వ్యక్తి విగతజీవిగా కనిపించాడు. వివరాలిలా ఉన్నాయి.. చెరువుకట్టపై ఓ వ్యక్తి మృతదేహం ఉండటాన్ని శుక్రవారం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రవి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అతడి జేబులో ఉన్న గుర్తింపు కార్డు ఆధారంగా చుంచుపల్లి మండలం గరిమెళ్లపాడుకు చెందిన కర్రి పాపారావు (56)గా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### మాస్‌లైన్ నాయకుడికి గాయాలు



చికిత్స పొందుతున్న రాంబాబు

పాల్వంచ: రోడ్డు ప్రమాదంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా నాయకుడు నిమ్మల రాంబాబు గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని దంతెలబోరకు చెందిన నిమ్మల రాంబాబు శుక్రవారం మోటార్ సైకిల్‌పై ఇల్లెందుకు వెళ్తుండగా బీసీఎం రోడ్‌లోని నవభారత్ వద్ద వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో రాంబాబుకు తల, చేతులకు గాయాలయ్యాయి. హెల్మెట్ ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు ఆయన్ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడంతో చికిత్స పొందుతున్నారు.

### వడదెబ్బతో యాచకుడి మృతి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో ఓ యాచకుడు వడదెబ్బతో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో యాచకుడు ఎంతకు లేవకపోవడంతో స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే మృతి చెందిన్నట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### కెనాల్‌లో పడి వృద్ధురాలు...

అశ్వాపురం: మండలంలోని అమెర్దకాలనీకి చెందిన వృద్ధురాలు షేక్ కతిజాజి (85) గ్రామ సమీపంలోని సీతారామ ప్రాజెక్ట్ కెనాల్‌లో పడి మృతి చెందింది. గురువారం కతిజాజి ఇంట్లోంచి వెళ్లగా రాత్రి వరకు రాలేదు. శుక్రవారం సీతారామ ప్రాజెక్ట్ కెనాల్‌లో కతిజాజి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. కతిజాజికి మతిస్థిమితం లేదు. కండ్లు కనపడవు. సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ వైపు నడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తూ కెనాల్‌లో పడి మృతి చెందినట్లు భావిస్తున్నారు. అశ్వాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి...

ఖమ్మంక్రైం: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి(35) మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. జీఆర్పీ ఎస్‌ఐ భాస్కర్‌రావు కథనం ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలును ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని అన్నం శ్రీనివాసరావు సాయంతో మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 58589, 94932 18856 నెంబర్లలో సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

### బావిలో పడి యువకుడు...

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని రాయగూడెంకు చెందిన పి.వేణు (37) గురువారం సాయంత్రం పొలానికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు భావిస్తున్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.